

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఓరియెంటేషన్ రోజు** ఉదయాన్నే లేచి, తలస్నానం చేసి, దేవుడికి దండం పెట్టుకుని బయలుదేరాను. హనీష పక్కింట్లో అమ్మాయి, నేను కలిసి ఉందామనుకున్నాము. మా ఇద్దరికీ ఎవరూ తెలీదు. ఆ రోజు ఏడ్చిన అమ్మాయి వాళ్ళ ఇంటికి వెళ్ళి తను కూడా మాతో వస్తుందా అని అడిగాము. ఆ అమ్మాయి మాత్రం ఇంకా ఏడుస్తూనే ఉంది. కళ్ళు కూడా వాచాయి.

"ఎవరైనా ఏదైనా వాళ్ళ ఇల్లు గుర్తొచ్చేవి అంటే ఆలస్యం, ఏడుపు మొదలు" తన రూమ్మేట్ చెప్పింది.

"పాపం" అన్నాను.

"అయ్యో, చెప్తే ఆశ్చర్యపోతావు. మొన్న పప్పుచారు చేసాను. వాళ్ళ అమ్మ గుర్తొచ్చిందని ఏడుపు మొదలుపెట్టింది. తిననేలేదు."

"నిజమా?" ఆశ్చర్యపోయాను.

"నిజం కావాలంటే లతని అడుగు" అంది.

తనని 'వస్తావా ' అని మళ్ళీ అడిగాను. కానీ సమాధానం చెప్పలేదు. నాకు విసుగు కలిగి మేము వెళ్ళిపోయాము. మాములు రోజులకన్నా చాలా కార్లు ఉన్నాయి. జనాలు కూడా నడుస్తూ కనబడ్డారు. కాస్త దడగా అనిపించింది. తెలిసిన మొహాలు కాబడలేదు. ఓరియెంటేషన్ స్పీచ్ బోరింగ్‌గా అనిపించింది. ఆ తరవాత కేంపస్ టూర్‌కి వెళ్ళాము. వాళ్ళు చూపిస్తున్నవన్నీ నేను హనీషతో ఇదివరకే చూసాను కాబట్టి అంత కొత్తగా ఏమీ అనిపించలేదు. కొత్తవాళ్ళు ఎవరూ పరిచయంఅవ్వలేదు కూడా. మధ్యాహ్నం ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఓరియెంటేషన్‌లో ఉన్నప్పుడు అభిషేక్ కావాలంటే ఇంటికి వెళ్ళొచ్చు, ఇంపార్టెంట్ వి అయిపోయాయి అని చెప్పాడు. సరే అని తనతో కలిసి ప్రొఫెసర్‌ని కలిసేందుకు బయలుదేరాను.

"నీకు వంట వచ్చా?" అడిగాడు.

ఇతనికి ఎందుకు? కొంప తీసి నన్ను ఏదైనా వండమంటాడా ఏంటి అనుకుంటూ "కొంచెం వచ్చు" అన్నాను.

"నా రూమ్మేట్‌కి రాదు"

అయితే నేనేం చెయ్యాలో అర్థంకాక ఏమీ మాట్లాడలేదు.

"ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు. నిన్న పప్పు చేద్దామనుకున్నాడట" అన్నాడు.

మళ్ళీ మౌనంగా ఉన్నాను.

"నువ్వు పప్పు చేస్తే ఎంత నీళ్ళు పోస్తావు?" అడిగాడు.

సమాధానం చెప్పేలోగా "తను ఒక కప్పు పప్పుకి ఒకే కప్పు నీళ్ళు పోసాడట. నేను కరెక్ట్ టైముకి వెళ్ళాను. గిన్నె అంతా మాడిపోయింది .నీకు మాడు వాసన వచ్చిందా?" అన్నాడు.

"లేదు, మా ఇంట్లో ఏం రాలేదు."

"ఇంట్లో కాదు. నిన్న మా ఇంటి బయట."

"లేదు. గమనించలేదు."

"అందుకే గబగబా వెళ్ళిపోయాను."

"ఓ..ఓకే."

కాసేపు నిశ్శబ్దంగా నడిచాము. ఇంతలో ప్రొఫెసర్ ఆఫీసు వచ్చింది.

"నేను వెళ్ళి కోర్సెస్ కనుక్కుంటా"

"ఓకే. కుదిరితే కంప్యూటేషనల్ ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ తీసుకో."

"స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ ఎందుకు?"

"అవి మేండెటరీ కోర్సెస్. ఈజీ కూడా. కంప్యూటేషన ఫిజిక్స్ కష్టం. ఇవి బాలెన్స్ అయిపోతాయి."

"సర్" ప్రొఫెసర్ ఆఫీసులోకి వెళ్ళాను.

అభిషేక్‌తో మాట్లాడి మంచి పని చేసాను. ప్రొఫెసర్ నేను ఏం కోర్సులు తీసుకోవాలనుకుంటున్నానో అడిగారు. అభిషేక్ చెప్పిందే చెప్పాను.

"సరే" అని ఎలా రిజిస్టర్ అవ్వాలో చూపించారు. ఆయన చదవమన్న బుక్స్ గురించి అడిగారు. లైబ్రరీ నుండి తీసుకున్నానని, ఇంకా పూర్తి చెయ్యలేదని చెప్పాను. చదివినంతవరకు ప్రశ్నలున్నాయా అంటే లేవని చెప్పాను.

ఆ తరవాత ఇంటికి వెళ్ళిపోయాను.

ఏదో తృప్తిగా ఉంది. ఎంతో బరువు తీసేసినంత సులువుగా ఉంది. తెలీని స్ట్రెస్ పోయింది. ఇంక మిగిలింది ఇల్లు వెతుక్కోవడమే. ఇంటికి వెళ్ళేసరికి హనీష లేదు. టెక్స్ట్ బుక్ తెరిచి చదవడం ప్రారంభించాను. ఒక్కదాన్నే ఇక్కడ ఉండటం అంత కష్టమైన పనేమీ కాదు. మొదట్లో  అనవసరంగా అంత భయపడ్డాను. అభిషేక్, రాం, హనీష, వెన్నెల, అందరూ మంచి వాళ్ళే. అన్నయ్య రూమ్మేట్స్‌లాగా కాదు. ఇంక మిగిలింది చదువుకుని ఉద్యోగం సంపాదించుకోవడమే.

మొదటి టెక్స్ట్ బుక్‌లోంచి డెఫినీషన్లు, ఫార్ములాలు ఒక బుక్‌లో రాసుకున్నా. అది బాగా చిన్నపుస్తకం అవ్వడంతో వేగంగా అయిపోయింది. రెండో పుస్తకంలో మొదటి రెండు చాప్టర్లు సులువుగానే ఉన్నాయి కానీ మూడో చాప్టర్ సరిగ్గా అర్థంకాక నాలుగోది ఇబ్బదిగా మారింది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందామని అన్నయ్య ఇంట్లో చూసిన 'వన్సపానె టైం ' సీరియల్‌ని లాప్‌టాప్‌లో పెట్టి వంట చేద్దామని కిచెన్‌లోకి వెళ్ళాను. అభిషేక్‌తో మాట్లాడినప్పటినుండి పప్పు తినాలనిపించడంతో టమాట పప్పు వండాను. వంట పూర్తయ్యేసరికి పక్కింటి అమ్మాయి వచ్చింది.

"సగంలో వెళ్ళిపోయావేంటి? నేను నీకోసం వెతికాను."

"ఓ, సారీ, నేను ప్రొఫెసర్‌ని కలవడానికి వెళ్ళాను. నువ్వు ఎక్కడా కనబడలేదు. లేట్ అవుతుందని వెళ్ళిపోయాను. సారీ."

"ఫరవాలేదులే, నేను కూడా నీతోపాటు వచ్చేసేదాన్ని. చాలా బోర్ కొట్టింది."

"నాకు హనీష ముందే చెప్పింది బోరని."

"కావాలనే ప్రొఫెసర్ దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకున్నావా?"

"లేదు. కో ఇన్సిడెన్స్."

"లక్కీ నువ్వు."

"నీకు టమాట పప్పు ఇష్టమా?"

"యా. నీకు?"

"నాకూ ఇష్టమే. ఇప్పుడే వండాను. తింటావా?"

"ఒద్దు. ఇంటికి వెళ్ళి తింటాలే"

"ఏం కాదు. కొంచెం తిను."

కాస్త మొహమాట పడిన తరవాత "సరే" అంది.

ఇద్దరం వడ్డించుకుని కూర్చున్నాము.

"పప్పు చాలా రుచిగా ఉంది."

"థాంక్స్."

"వంట అమెరికాకి వచ్చేముందు నేర్చుకున్నావా?"

"లేదు సమ్మర్ హాలిడేస్‌లో అమ్మమ్మ నేర్పేది."

"వావ్. వెరీ గుడ్. సమ్మర్ లో మీ అమ్మమ్మ వచ్చేవాళ్ళా?"

"లేదు. నేను వాళ్ళ ఊరుకి వెళ్ళేదాన్ని."

"పల్లెటూరా?"

"అవును."

"నాకు పల్లెటూళ్ళు చాలా ఇష్టం కానీ మాకు ఎవరూ లేరు ఊళ్ళల్లో. ఓన్లీ సినిమాల్లో చూడడమే. "

"అయ్యో, అవునా"

"యా. మా ముత్తాతయ్య వాళ్ళు ఎన్నో జెనరేషన్స్ ముందు ఒంగోల్‌కి వచ్చారట. తరువాత వైజాగ్‌లో స్థిరపడ్డారు."

"నీకెలా తెలుసు?"

"మా పెద్దమ్మ చెప్పింది."

"మీరు చాలా క్లోజా?"

"జాయింట్ ఫ్యామిలీ."

"నాకు జాయింట్ ఫ్యామిలీస్ చాలా ఇష్టం. సమ్మర్‌లో నేను, మా కజిన్స్ మాది జాయింట్ ఫ్యామిలీ అయితే ఎంత బావుండేది అనుకునేవాళ్ళం."

"జాయింట్ ఫ్యామిలీస్ పిల్లలకి బానే ఉంటుంది కానీ పెద్దవాళ్ళకి కష్టం. మా ఇంట్లో ఎన్ని గొడవలు జరిగాయో."

"సరిపోయింది. నీకు పల్లెటూళ్ళు ఇష్టం, నాకు జాయింట్ ఫ్యామిలీ ఇష్టం."

ఇద్దరం కంచాలు తోమి బయట కూర్చున్నాము.

"నువ్వు వాళ్ళ టెంపరెరీ రుమ్మేటా?" అడిగింది.

"ఔను. డార్మ్ కి మారాలి."

"ఓ డార్మ్ లో ఉంటావా?"

"అప్పుడైతే చదువుకోవడానికి ఈజీ ఉంటుందని అందరూ అన్నారు."

"మీ డిపార్ట్మెంట్ చాలా టఫ్ అని విన్నాను."

"ఔను. నేను అదే వింటున్నా రోజూ."

"భయపడకులే. అంత టఫ్ కాదేమో."

"యా. హోప్ ఫుల్లీ."

కాసేపు నిశ్శబ్దం తరవాత "నువ్వు బయోటెక్నాలజీ కదా?"

"బయో మెడికల్."

"ఓ, సారీ. మీది ఎలా ఉంటుందట?"

"మాది అంత టఫ్ కాదట. అడ్వైసర్ని బట్టి అన్నారు."

"నీ అడ్వైసర్ ఎవరు?"

"డాక్టర్ విన్సెంట్. బానే మాట్లాడారు. ఈజీగానే ఉంటుందేమో."

మళ్ళీ కాస్త నిశ్శబ్దం తరువాత, "నేను ఇంటికి వెళ్తాను" అంది.

"సరే" అని బదులిచ్చి, బై చెప్పి మళ్ళీ పుస్తకం తెరిచి మూడో చాప్టర్ చదవడం ప్రారంభించాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story